# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 22, మే 2026




## వడదెబ్బ తగిలి రైతు మృతి

**దస్తురాబాద్, మే 21, ప్రభాతవార్త:**

రేవోజిపేట గ్రామంలో బుధవారం సాయంత్రం కట్ల వెంకన్న (63) వడదెబ్బ తగిలి మృతి చెందాడు. సాయంత్రం 5 గంటల సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లిన ఆయన, అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా సాయంత్రం సమయంలో గ్రామ సమీపంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ సంఘటనను గమనించిన అదే గ్రామానికి చెందిన ఇరువురు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు కట్ల అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దస్తూరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోస్టుమార్టం పరీక్ష పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అన్నదాతల కన్నెర్ర..



- గోదాముల్లో వడ్లను అన్‌లోడ్ చేయాలని జాతీయ రహదారిపై ధర్నా
- మంత్రి వివేక్ ఆదేశాలను అధికారులు బేఖాతరు చేస్తున్నారని మండిపాటు
- భారీ ట్రాఫిక్ జాంతో స్థంబించిన రాకపోకలు
- చెన్నూరు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ చొరవతో శాంతించిన రైతులు

**చెన్నూరు, మే 21, ప్రభాతవార్త**

ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను అమ్ముకోవడానికి రైతులు పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదు. వారిని చూస్తుంటే ప్రతీ గుండె తరుక్కుపోతుంది. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని మార్కెట్ యార్డు వద్ద రైతులు రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. చేతికొచ్చిన వరి పంటను విక్రయించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా అధికారులకు ఆదే శాలు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ స్థానిక గోదాముల్లోనే తమ వడ్లను అన్‌లోడ్

మిగతా 2లో..



# తల్లి పిల్లల సంరక్షణ కొరకై మెరుగైన సేవలు

**బజార్‌హత్నూర్, మే 21, ప్రభాతవార్త:**

తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రసూతి తల్లులకు, చిన్నారులకు సౌకర్యవంతమైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాతా శిశు సంక్షేమ కేంద్రం ద్వారా తల్లులు తమ శిశువులకు ప్రశాంత వాతావరణంలో పాలిచ్చేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యమన్నారు. అనంతరం ఆసుపత్రిని పరిశీలించిన ఎంపీ, వైద్య సిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా జిల్లా డీఎంహెచ్‌వోతో సంప్రదించి వైద్యులను నియమించేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్, మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, నాయకులు కొత్త శంకర్, అల్కే గణేష్, సూది నందు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

**❉ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు**

**జైపూర్, మే 21, ప్రభాతవార్త**

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసి కేటాయించబడిన గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారంలోని వరలక్ష్మి, జయలక్ష్మి రైస్ మిల్లులు, సుముఖ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జైపూర్ మండల తహసిల్దార్ వనజా రెడ్డిలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మిగతా 2లో..



# వరి ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

**❉ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, మే 21, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించిన దాన్యం దిగుమతి ప్రక్రియలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేటలో గల వాసవి రైస్ మిల్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్ లతో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు మిగతా 2లో..



# అన్నదాతల కన్నెర్ర..

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని డిమాండ్ చేశారు. లారీలు అందుబాటులో లేక ధాన్యం తరలింపు నిలిచిపోయిందని, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా గిడ్డంగులు, వ్యవసాయ మార్కెట్ వద్ద పడిగాపులు కాస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపించారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారికి ఇరువైపులా భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే ప్రయాణికులతో పాటు అంత్యపుష్కరాలకు వెళ్తున్న భక్తులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న చెన్నూరు పట్టణ ఎస్సై రాజశేఖర్ ఘటనాస్థలికి చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతుల కోసం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులకు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని తెలిపారు. జిల్లాలోని రైతులు ఇబ్బందులు పడకుండా వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు రైస్ మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పోరేషన్ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, జిల్లా మేనేజర్, నస్పూర్ మండల తహసిల్దార్ సంతోష్ లతో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. నిల్వ చేసిన ధాన్యాన్ని తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కనికారపు అశోక్

తాండూర్, మే 21, ప్రభాతవార్త :

అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కనికారపు అశోక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భగత్ సింగ్ కమ్యూనిటీ హాల్లో గురువారం తాండూర్ మండల వ్యవసాయ కార్మిక సంఘం ప్రథమ మహాసభ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ రాంజీ పథకంగా పేరు మార్చడం సరికాదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు వేల్పుల శంకర్, మండల కార్యదర్శి కొమ్మ కేతా, సభ్యులుగా యాకుబ్ ఖాన్, మున్నా బేగం, ఫర్వీన్ బేగం, దుర్గం శ్రీలత, జేనేని లక్ష్మి, కందుకూరి లలిత, ఊరదా సరితలను ఎన్నుకున్నారు.మహాసభల్లో చేతి వృత్తిదారుల రాష్ట్ర నాయకులు పైళ్ళ ఆశయ్య, గుమాస అశోక్, నాయకులు దాగం రాజారాం, దాగం శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### సీసీసీ నస్పూర్ ఎస్సై ఎం. ప్రశాంత్ ♦ గంజాయి నియంత్రణే లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో సోదాలు

నస్పూర్, మే 21, ప్రభాతవార్త

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీసీసీ నస్పూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రశాంత్ పిలుపునిచ్చారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణతో పాటు ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్కోటిక్ డాగ్ స్క్వాడ్, యాంటీ నార్కోటిక్స్ వింగ్, సీసీసీ నస్పూర్ పోలీసులు సమన్వయంతో గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీసీసీ నస్పూర్ ఎస్సై ఎం. ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సోదాల్లో సీసీసీ కార్నర్ ప్రాంతం, ఆటో స్టాండ్ పరిసరాలు, సమీప హోటళ్ళు, పాన్ షాపులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, నిల్వలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎం. ప్రశాంత్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా ఆటో స్టాండ్ వద్ద ఉన్న వ్యక్తులు, ప్రయాణికుల సామాన్లు, అనుమానాస్పద ప్రదేశాలను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో పరిశీలించారు. ప్రజలకు గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ తనిఖీల్లో యాంటీ నార్కోటిక్స్ వింగ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



డాగ్ స్క్వాడ్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై ఎం. ప్రశాంత్, పోలీస్ సిబ్బంది

# అగ్ని ప్రమాదంలో 6 గొర్రె పిల్లలు మృతి

హాజీపూర్, మే 21, ప్రభాతవార్త



మండలంలోని బుద్దిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొండాపూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదం గ్రామాన్ని విషాదంలో ముంచెత్తింది. ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు క్షణాల్లోనే గొర్రెల కొట్టాన్ని పూర్తిగా దహనం చేయడంతో పాటు అందులో ఉన్న ఆరు గొర్రె పిల్లలు సజీవ దహనమయ్యాయి. ఈ ఘటనతో జీవనాధారాన్ని కోల్పోయిన కాపరి కుటుంబం తీవ్ర ఆవేదనలో మునిగిపోయింది. కొండాపూర్ గ్రామానికి చెందిన మెరుగు రాజయ్య గొర్రెల పెంపకం పైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రతి రోజులాగే గురువారం కూడా గొర్రెలను మేతకు తీసుకెళ్లగా, అతని భార్య లక్ష్మి ఇంటి అవసరాల కోసం లక్కెట్టిపేటకు వెళ్లింది. ఇదే సమయంలో అకస్మాత్తుగా గొర్రె కొట్టంలో మంటలు చెలరేగాయి. కొద్ది సేపటికే మంటలు ఉధృతంగా వ్యాపించి మొత్తం కొట్టాన్ని అంటుకున్నాయి. పక్కనే నివసిస్తున్న మెరుగు అంజయ్య, లింగవ్వ మంటలను గమనించి వెంటనే రాజయ్య కుటుంబానికి సమాచారం అందించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని నీటితో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న పెద్దంపేట గ్రామానికి చెందిన పొట్టల కవిత చొరవ చూపి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించినప్పటికీ అప్పటికే గొర్రె కొట్టం పూర్తిగా కాలిపోయింది. మంటల్లో చిక్కుకుని ఆరు గొర్రె పిల్లలు సజీవదహనమవ్వడంతో ఘటన స్థలం హృదయ విదారకంగా మారింది. సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న మెరుగు రాజయ్య, అతని భార్య లక్ష్మి కాలిపోయిన గొర్రె పిల్లలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆర్తనాదాలు గ్రామస్తుల కళ్లలోనూ నీళ్లు తెప్పించాయి.ఈ ప్రమాదంలో సుమారు ఒక లక్ష విలువైన గొర్రె కొట్టంతో పాటు నలభై వేల విలువైన గొర్రె పిల్లలు నష్టపోయినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమ కుటుంబం ఇప్పుడు పూర్తిగా దెబ్బతిన్నదని రాజయ్య వేదన వ్యక్తం చేశారు. గొర్రెలే మా జీవనాధారం.. ఇప్పుడు మాకు ఏ దిక్కూ కనిపించడం లేదు అంటూ బాధతో కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ ఘటనపై గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. జీవనాధారాన్ని కోల్పోయిన ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, నష్టపరిహారం మంజూరు చేసి పునరావాస చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# దేశ సంస్కరణల్లో రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయం

### మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్

నస్పూర్, మే 21, ప్రభాతవార్త



దేశ సంస్కరణల్లో, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ పాత్ర చిరస్మరణీయం అని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ కొనియాడారు. రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత సాంకేతిక రంగానికి, ఆధునిక అభివృద్ధికి రాజీవ్ గాంధీ వేసిన పునాదులను ధర్ని మధుకర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశ గమనాన్ని మార్చాయని పేర్కొన్నారు. సమాజంలోని నిరుపేదలకు, వెనుకబడిన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడానికి ఆయన నిరంతరం కృషి చేశారని వివరించారు. యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లతో పాటు నస్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నూకల రమేష్, వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా, యువజన, మైనార్టీ, రిటైర్డ్ ఉద్యోగుల కాంగ్రెస్ విభాగాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలనీ వాసుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

### - మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్

నస్పూర్, మే 21, ప్రభాతవార్త



కాలనీ వాసుల భద్రత కోసం సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ కొనియాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 33వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఎంబాడీ కుమారస్వామి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం మేయర్ స్థానిక ఎస్సై ఎం. ప్రశాంత్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి ఈ నిఘా నేత్రాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ధర్ని మధుకర్ మాట్లాడుతూ కాలనీల్లో నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలని, కాలనీ అసోసియేషన్లు ఇలాంటి నిఘా వ్యవస్థల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నేరాలను అరికట్టడంలో పోలీసులు విజయం సాధిస్తున్నారని ఎస్సై ప్రశాంత్ తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల స్థానిక ప్రజలకు పూర్తి రక్షణ లభిస్తుందని కార్పొరేటర్ ఎంబాడీ కుమారస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 26వ డివిజన్ కార్పొరేటర్ ఇరగదిండ్ల రవి, 27వ డివిజన్ కార్పొరేటర్ కొండ్ర రాజేశ్వరి లింగయ్య, 33వ డివిజన్ ఇన్‌చార్జి తోడే సురేష్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మందమర్రి కేకేఓసిలో ఉత్పత్తి లక్ష్యాల సాధనపై కీలక సమీక్ష సమావేశాలు

**- బొగ్గు నాణ్యత పరిరక్షణపై ప్రత్యేక దృష్టి - ఉత్పాదకత పెంపు, భవిష్యత్ సవాళ్లపై అధికారుల కీలక సూచనలు**
**- మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ**

**మందమర్రి, మే 21, పభాతవార్త:**

సింగరేణి సంస్థలో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు లక్ష్యంగా మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు అన్ని ఏరియాలలో నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో భాగంగా మందమర్రి ఏరియాలోని కీలకమైన కేకే ఓపెన్ కాస్ట్ గనిలో విస్తృత స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలు గని పరిధిలోని మొదటి, రెండవ, మూడవ షిఫ్ట్‌ల ఉద్యోగులతో విడివిడిగా నిర్వహించబడగా, ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ఇల్లందు క్లబ్‌లో జనరల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది, సివిల్ విభాగం, జిఎంవిటిసి, ఎస్ అండ్ పిసి విభాగాల ఉద్యోగులతో కొనసాగించబడ్డాయి. సింగరేణి వద్ద మరి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో ఈ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మందమర్రి ఏరియా అభివృద్ధిలో కేకేఓసి గని అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. భారీ యంత్రాల వినియోగంతో తక్కువ సమయంలో అధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ, ఏరియాకు ప్రధాన ఆర్థిక వనరుగా నిలుస్తోందన్నారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు తవ్వకాల్లో ఉద్యోగుల శ్రమ అభినందనీయమని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఉద్యోగి కట్టుబడి ఉండాలని అధికారులు సూచించారు. గని అభివృద్ధిలో కేకేఓసి ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. సమీక్ష సమావేశాల్లో ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ముఖ్యంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో భారీ యంత్రాల సమర్థ వినియోగం, పనితీరు మెరుగుదల, సంస్థ అమలు చేస్తున్న ఉద్యోగుల సంక్షేమ పథకాలు, ఆర్థిక అంశాలపై అధికారులుచర్చించారు. అలాగే సంస్థ భవిష్యత్ కార్యాచరణ, ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. బొగ్గు నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని అధికారులు స్పష్టం చేశారు. బొగ్గుతో పాటు రాయి, మట్టి కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేకే ఓసి గనిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ఆ నాణ్యతను నిలబెట్టుకోవడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జిఎం జి.ఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ ఎం. కుమారస్వామి, ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్, గ్రూప్ ఏజెంట్ రాంబాబు, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి, ప్రాజెక్ట్ ఇంజనీర్ వేంకటవంశీధర్, ఏజిఎం (ఎఫ్ అండ్ ఎ) ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్, డీజిఎం పర్సనల్ సీహెచ్ అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, క్వాలిటీ ఇంచార్జ్ ప్రదీప్, గని మేనేజర్ రామరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్యామ్, సంక్షేమ అధికారి సందీప్ తదితరులు, గని అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.








ఏరువాక పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో ప్రదీప్, సర్పంచ్ సిరం సుష్మరెడ్డి

## దేగాం గ్రామంలో ఏరువాక పనులు ప్రారంభం

**భైంసా, మే 21, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భైంసా మండలంలోని దేగాం గ్రామంలో ఏరువాక పనులను ఎంపీడీవో ప్రదీప్, సర్పంచ్ సిరం సుష్మరెడ్డి ప్రారంభించారు. ఉపాధి హామీ నిధులతో రైతులకు ఉపయోగకరమయ్యే పనులను ప్రభుత్వం చేపడుతుందని వారు అన్నారు. కాలువల పూడికతీత, ఇతరత్ర పనులు చేపట్టి ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో లక్ష్మారెడ్డి, టీఏ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి కారగిరి భోజన్న తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్

## పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మాజీ మంత్రి

**సారంగాపూర్, మే 21, ప్రభాతవార్త:**

మండలంలో గురువారం మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కౌట్ల (బీ), సారంగాపూర్ మార్కెట్ యార్డ్, జామ్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది వర్షాకాలం కావడంతో త్వరగా మొక్కజొన్న, వరి, జొన్న కొనుగోళ్లు చేపట్టి వెంటవెంటనే గోదాములకు తరలించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే స్థానికంగా ఉండి వెంటవెంటనే ధాన్యాన్ని గోదాములకు తరలింపజేయాలని, ఆయన నిర్లక్ష్యంతో ఎక్కడికక్కడే పంటలు ఉన్నాయని విమర్శించారు. ఆయన వెంట ఆల్లోల మురళీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, సర్పంచులు బల్గురి అజయ్, కోనేరు భూమన్న, కౌట్ల పీఏసీఎస్ సీఈవో మల్లేష్, సిబ్బంది, నాయకులు మాధవరావు, రాజేశ్వర్ రావు, రాజేశ్వర్, నర్సా రెడ్డి, నర్సయ్య, నారాయణరెడ్డి, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

## మాజీ ఎంపీటీసీని పరామర్శించిన మాజీ మంత్రి

**సారంగాపూర్, మే 21, ప్రభాతవార్త**



మండలంలోని ప్యారమూరు మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి తల్లి ఉప్పులపు భోజవ్వ గత శనివారం అర్ధరాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట ప్యారమూరు సర్పంచ్ వరలక్ష్మి, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, సారంగాపూర్ మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కౌట్ల (బీ) పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణ రెడ్డి, నిర్మల్ పీఏసీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మాజీ ఎంపీపీ అట్లా మహిపాల్ రెడ్డి, సారంగాపూర్ మండల నాయకులు మాధవరావు, సాయినాథ్ రెడ్డి, రాజేశ్వర్ రావు, మార్కెట్ డైరెక్టర్ అహ్మద్ ముక్తార్, సుజిక్ లింగారెడ్డి, మిర్ద సాయన్న, కాంగ్రెస్ పార్టీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాక్‌పెల్లి సురేందర్, చిలుక నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ కాస్ట్ కార్మికుల పనివేళలు వెంటనే మార్చాలి

**నస్పూర్, మే 21, ప్రభాతవార్త**



శ్రీరాంపూర్ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల వరకు నమోదవుతున్న నేపథ్యంలో సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న కార్మికుల పనివేళల్లో వెంటనే మార్పులు చేయాలని గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోతుకూరి కొమురయ్య డిమాండ్ చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండుతున్న ఎండల్లో పనులు చేయడం వల్ల కార్మికుల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల భద్రతకు సింగరేణి యాజమాన్యం మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉదయం చల్లని సమయాల్లో పనులు నిర్వహించి, మధ్యాహ్నం తీవ్ర ఎండ వేళల్లో పనులను తగ్గించడం ద్వారా కార్మికులకు విశ్రాంతి కల్పించాలని మోతుకూరి కొమురయ్య కోరారు. వేడి తీవ్రత కారణంగా కార్మికులు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆరోగ్య పరిరక్షణ చర్యలు అత్యవసరమని పేర్కొన్నారు. గనుల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు సమృద్ధిగా అందించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో సరైన విశ్రాంతి షెడ్లు, చల్లని తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడటం సంస్థ కనీస బాధ్యత అని, యాజమాన్యం ఈ సమస్యలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## మహిళా కమిషన్ సభ్యులను సన్మానించిన బీసీ హక్కుల నేత సుంకేట పోశెట్టి

**భైంసా, మే 21, ప్రభాతవార్త:**

హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమితులైన చాకలి ఐలమ్మ మునిమనమరాలు చిట్యాల శ్వేత సంపత్, తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి మాతృమూర్తి శంకరమ్మలను తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి సన్మానించారు. ఈ సందర్భంగా సుంకేట పోశెట్టి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అమరవీరుల కుటుంబాలను గుర్తించి, వారిని మహిళా కమిషన్ సభ్యులుగా నియమించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులుగా నియమించబడిన వారు రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న వివక్షతోపాటు, వారి ఆత్మగౌరవం, హక్కుల కోసం అహర్నిశలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, రాములు, రాజేందర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకేట పోశెట్టి

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

**తాండూర్, మే 21, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ఆధ్యక్షులు పెదబోయిన శంకర్, మంచిర్యాల కాంగ్రెస్ డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు,మాజీ జడ్పీటీసీ సాలిగామ బానయ్య, నాయకులు శంకర్ గౌడ్, పుట్ట శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, మాస వెంకట స్వామి, దేగ స్వామి తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

## తాండూర్ పీహెచ్సీలో పండ్లు పంపిణీ..

**తాండూర్, మే 22, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్టెం విష్ణుకళ్యాణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండి ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, నాయకులు సుందిల్ల భూమయ్య, సత్యం, కిరణ్, మాసాడి తిరుపతి, శంకర్, జుబైర్, శ్రీధర్, శ్రీకాంత్, ఆదమ్ ఖాన్, ముస్కె సాగర్, రఘు, సంతోష్, కంపెల్ల శ్రీనివాస్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.


పిహెచ్సిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

**ఆసిఫాబాద్, మే 21, ప్రభాతవార్త:**

దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి విశేష కృషి చేశారన్నారు. యువతకు సాంకేతికతను చేరువ చేస్తూ దేశాన్ని ఆధునీకీకరణ దిశగా తీసుకెళ్లిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఉగ్రవాద వ్యతిరేక దినంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ అజ్మీర శ్యాం నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధక్షులు తరిఖ్, భీమ్ రావు, ప్రధాన కార్యదర్శి చిన్న మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



**లక్షెట్టిపేట, మే 21, ప్రభాతవార్త**

పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... ఈరోజు ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం గా పాటిస్తున్నామని, రాజీవ్ గాంధీ పంచాయతీలను పటిష్టంగా చేయడానికి 73, 74 ఆర్టికల్ రాజ్యాంగ సవరణ చేసి మార్గం సిద్ధం చేశారని, ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టి మనదేశాన్ని ప్రపంచ దేశాల్లో ముందుకు తీసుకెళ్లారని, యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు తీసుకువచ్చిన ఘనత రాజీవ్ గాంధీ అని,దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు సాంకేతిక విద్య, ఆధునిక భారత నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాగభూషణం, చింత అశోక్ కుమార్, దొంత నరసయ్య, గ్రామల సర్పంచ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**జన్నారం, మే 21, ప్రభాతవార్త**

మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.గురువారం ఉదయం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నూతన మండల, పట్టణ అధ్యక్షులు నందు నాయక్, మంద రాజేష్లు మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ రెండు పర్యాయాలు భారత ప్రధానిగా పని చేశారని, 40 ఏళ్ల చిన్న వయసులోనే దేశానికి ప్రధాని అయిన యువ నేత అని కొనియాడారు. టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థను అభివృద్ధి చేసి భారతదేశాన్ని ఆధునిక యుగం వైపు నడిపించారని, ఐటీ రంగ పితామహుడిగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడిగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా ఆయన ముద్ర ఎన్నటికీ చెరగదని తెలిపారు.గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నందు నాయక్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ,పట్టణ అధ్యక్షులు మంద రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్సాక్, జిల్లా కార్యదర్శి ముజాఫర్,వర్తక సంఘం అధ్యక్షులు వోజ్జల వామన్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బెడద సత్తయ్య, రోటిగూడ ఉపసర్పంచ్ గాజుల సత్తయ్య, పాదం రాకేష్, మాజీ జెడ్పిటిసి పంకజ, సీనియర్ నాయకులు, సర్పంచ్లు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**భైంసా, మే 21, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ముథోల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు బోస్లే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ శ్యామ్‌రావు పటేల్, భైంసా పట్టణ అధ్యక్షులు షాహిద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**భైంసా, మే 21, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, మాజీ శాసనసభ్యులు జీ విఠల్ రెడ్డి ఆదేశాల మేరకు సాంకేతిక విప్లవం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పునాదులు వేసిన భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం ఈరోజు భైంసా పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ ఫరూక్ అహ్మద్, రమేష్ మాశెట్టివార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్


నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


నివాళులు అర్పిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ




## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

**నేరడిగొండ, మే 21, ప్రభాతవార్త:**

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతా శిశువుల పాలిచ్చే గదిని బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.



## కూలిన కోమటి చెరువు తూము

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- చెరువును కాపాడాలని అస్నాద్ రైతుల వేడుకోలు

**చెన్నూరు, మే 21, ప్రభాతవార్త**

తమ పంట పొలాలకు సాగునీరు అందించే కోమటి చెరువు తూము కూలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని అస్నాద్ గ్రామంలోని కోమటి చెరువు తూము శిథిలావస్థకు చేరికుంది. తూము ఒకవైపు కొంత భాగం కూలడంతో వచ్చే వర్షాకాలం దృష్ట్యా తూము మొత్తానికి కూలిపోతే నీరు వృధాగా పోతుందని, నీరులేక పంటలు ఎండిపోతే ఆర్థికంగా నష్టపోతామని రైతులు బాధపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన తూమును తొలగించి అదేస్తానములో కొత్తది నిర్మించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

## రైతులకు నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మే 21, ప్రభాతవార్త**



రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేస్తున్న ధాన్యానికి సంబంధించి ఆయా రైతుల ఖాతాలలో నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళలతో కలిసి సందర్శించి రైతులకు చేస్తున్న నగదు చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, ఈ క్రమంలో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలను నగదు చెల్లింపులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వివరాలు రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయడంతో పాటు ట్యాబ్ లలో నమోదు చేయాలని, ఆ దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దొడ్డు రకాల వరి పంట సాగు చేయవద్దు

**హాజీపూర్, మే 21, ప్రభాతవార్త**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సురేఖ

నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసిన, నిల్వచేసిన, అమ్మకాలు, కొనుగోలు చేసిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి మంచిర్యాల సురేఖ అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో రైతు వేదిక గుడిపేట్ నందు నియోజక వర్గ స్థాయి వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, ఎరువులు విత్తన డీలర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారి మంచిర్యాల సురేఖ మాట్లాడుతూ, లైసెన్స్ పొందని అనుమతి లేని ఎట్టి విత్తనమైన నకిలీ విత్తనముగా పరిగణించబడుతుంది. రైతులు అధీకృత లైసెన్స్ పొందిన డీలర్ వద్ద కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా గడ్డిమందు రహిత నిషేధిత పత్తి విత్తనాలు అనుమతి లేనివి రైతులు వివిధ మార్గాల్లో పొందుతున్నారని, అట్టి విత్తనాలు ప్రభుత్వం అనుమతి లేనందున కొనుగోలు చేయరాదు అన్నారు. నిషేధిత గడ్డి మందు గ్లైఫోసెట్ వినియోగించరాదు అని తెలిపారు. రైతులు వరిలో దొడ్డు రకాలను సాగు చేయరాదు అని, అట్టి వరి రకాలకు మార్కెటింగ్ సౌకర్యం ఉండదని తెలిపారు. ప్రతి సీజన్‌లో సన్న రకాలు బీపీటీ 5204, తెలంగాణ సోనా ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, జై శ్రీరామ్, హెచ్ ఎంటీ, డబ్ల్యూజిఎల్ 962,44, జెజిఎల్ 1798, ప్రాధాన్యత గల సన్న రకాలు సాగు చేసి బోనస్ కూడా పొందవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ అనుమతి లేని పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన అమ్మకాలు చేసిన పిడి యాక్ట్ నమోదు చేయడము జరుగుతుంది అని విత్తన చట్టం మరింత కఠినంగా ఉన్నందున రైతులు కేసుల్లో ఇరుక్కోరాదు అని తెలిపారు. డీలర్లు ఎట్టి పరిస్థితుల్లో నిషేధిత పత్తి విత్తనాలు నిల్వ అమ్మకాలు ప్రోత్సహించ రాదు అని, ఎవరైనా గ్రామాల్లో ఇటువంటి విత్తనాలు అమాయకపు రైతులకి అమ్మచూపినపుడు వెంటనే వ్యవసాయ శాఖ పోలీసు అధికారులు సమాచారం అందించాలని, నిషేధిత పత్తిని అరికట్టడం సహకరించాలని తెలిపారు. మండల టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ మామిడి క్రిష్ణ, తహశీల్దార్లు హజీపూర్ పుష్పాలత, లక్షెట్టిపేట్ దిలీప్, దండేపల్లి రోహిత్, మంచిర్యాల రఫతుల్లా, సీఐ రమణ మూర్తి, ఎస్ఐ హాజీపూర్ కిరణ్ కుమార్, లక్షెట్టిపేట్ సురేష్, వ్యవసాయ అధికారులు హాజీపూర్ ఏఓ క్రిష్ణ, మంచిర్యాల ఏఓ మహేందర్, లక్షెట్టిపేట్ ఏఓ శ్రీకాంత్, దండేపల్లి, జన్నారం ఏఓ అంజిత్, డీలర్లు పాల్గొన్నారు.




## నర్సాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**తాండూర్, మే 22, ప్రభాతవార్త :**

మండలంలోని నరసాపూర్ గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో పీఎం జన్మాన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మంది గిరిజనులకు డాక్టర్ ఆదిత్య, తాండూర్ పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ ఏనుగు ఝాన్సీరాణి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని డిప్యూటీ డియం అండ్ హెచ్ఓ సుధాకర్ నాయక్ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాత్ రావు, ఉప సర్పంచి పరబత్ రావు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పుట్ట సత్తయ్య, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ రమాదేవి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రసన్న, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ప్రశాంత్, స్టాఫ్ నర్సు గౌతమి, ఏఎన్ఎంలు పారిజాతం, స్రవంతి, ల్యాబ్ టెక్నీషియన్ కీర్తన, పంచాయతీ సెక్రటరి జగదీశ్, అంగన్వాడీ టీచర్ జమున, సీతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు మరింత చేరువగా టిజిఎన్పీడీడీసీఎల్ యాప్

**ఆసిఫాబాద్ టౌన్, మే 21, ప్రభాతవార్త:**

వినియోగదారులకు మరింత చేరువై సాంకేతిక పరంగా మరిన్ని సేవలను జోడిస్తూ టిజిఎన్పీడీడీసీఎల్ యాప్‌ను రూపొందించడం జరిగిందని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తమ్ జాడే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సౌకర్యార్థం 28 ఫీచర్లతో ఈ యాప్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఈ యాప్‌లో ముఖ్యంగా కన్స్యూమర్ గ్రీవెన్సెస్, పే బిల్స్, బిల్ హిస్టరీ, వినియోగదారుల బిల్లు సమాచారం, ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ, రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్, కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి, పేరు / లోడ్ మార్పు, హెచ్‌టి కన్స్యూమర్ పోర్టల్, ఆన్‌లైన్ ఎస్టిమేట్ / డిమాండ్ నోటీసు చార్జీల చెల్లింపుతో పాటు మరిన్ని సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఇందులో అందుబాటులో ఉంటాయని, సమస్యల పరిష్కారం కోసం వినియోగదారులు 1912 నంబర్లను సంప్రదించవచ్చున్నారు. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్లలో టిజిఎన్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పై సేవలను వినియోగించుకోవాలని, నాణ్యమైన సేవలు పొందుతూ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూపరింటెండింగ్ ఇంజనీర్ కోరారు.

## రైతులు సమస్యలను విచారించిన మాజీ ఎమ్మెల్యే

**బెల్లంపల్లి, మే 21, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల మండల పరిధిలోని గొల్లపల్లి, జోగాపూర్, గంగారం గ్రామాల్లో వరిధాన్యం కల్లాలను పరిశీలించిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ఆయన, వాటిని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన తీవ్ర స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, గడిచిన రెండున్నర సంవత్సరాల్లో రైతులకు ఏ విధమైన ప్రయోజనం కల్పించలేదని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రైతుభరోసా పేరుతో ఎకరానికి సంవత్సరానికి రూ,, 16,000 ఇస్తామని చెప్పి మూడు సార్లు ఆ హామీని నిలబెట్టుకోలేదని అన్నారు. అలాగే సన్న వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ఢిల్లీకి కప్పం కట్టడంలో బిజీగా ఉన్న కాంగ్రెస్ నాయకులు, యాసంగి కాలంలో వరిధాన్యం కల్లాల్లో ఇబ్బందులు పడుతున్న రైతులపై కనీసం కనికరం చూపడం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు సౌకర్యాల్లో ఉండగా, రైతులు మాత్రం ఎండలు, వర్షాల్లో తమ ప్రాణాలను పణంగా పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి, రైతుల వరిధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని, లేకపోతే రైతుల పక్షాన ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ మేకల మల్లేష్, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, గొల్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ మోగిలి, జోగాపూర్ ఉపసర్పంచ్ సుమలతశ్యామ్, బిఆర్ఎస్ నాయకులు సింగతి రాంచందర్, సంతోషం ప్రతాప్ రెడ్డి, పంజాల సాగర్ గౌడ్, ఇందూరి రమేష్, తిరుపతి గౌడ్, శివ, జాడి శంకర్, రాజేష్, ఉషన్న తదితరులు పాల్గొన్నారు.



## నేడు జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

**ఆసిఫాబాద్, మే 21, ప్రభాతవార్తా :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఉదయం 9.30 ప్రారంభమవు తుందన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, జిల్లా అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై చర్చించుకొనేదుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, రైతు, యువజన సంఘం నాయకులతో పాటు జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొనాలని పేర్కొన్నారు.



## చీకటిలో ఉన్న జీవితాలకు వెలుగైన రామస్వామి నేత్రదానం

**బెల్లంపల్లి, మే 21, ప్రభాతవార్త**

బెల్లంపల్లి కాల్‌టెక్స్ ప్రాంతానికి చెందిన నేలకంటి రామస్వామి (75) ఇక లేరు కానీ ఆయన చూపు మాత్రం ఈ ప్రపంచాన్ని ఇంకా చూస్తూనే ఉంది. ఎండదెబ్బతో ఆయన ప్రాణాలు కోల్పోవడం కుటుంబానికి తీరని లోటు. ఇంటి పెద్దను కోల్పోయిన ఆ బాధలో ప్రతి ఒక్కరూ మునిగిపోయిన వేళ. ఒక మహత్తరమైన నిర్ణయం ఆ ఇంటిని మరింత గొప్పదిగా నిలబెట్టింది. మన తండ్రి కళ్ళు ఇంకొంతమందికి వెలుగులు కావాలి అన్న ఆలోచనతో, పుట్టెడు దుఃఖాన్ని మింగుకుంటూ కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకు రావడం నిజంగా హృదయాన్ని కదిలించే విషయం. వారి ఆ ఒక్క నిర్ణయం చీకటిలో ఉన్న ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపింది. జనహిత సేవా సమితి సభ్యుడు డోలి సుకుమార్ చెప్పిన మాటలు ఆ కుటుంబానికి మార్గదర్శకమయ్యాయి. వెంటనే ఎల్.వి. ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ వచ్చి కార్నియాలను సేకరించారు. రామస్వామి చూపు ఇప్పుడు ఇంకొద్దిమందికి జీవన దీపంగా మారింది. భార్య ఎల్లమ్మ, కుమారులు నాగేష్, రాజేందర్, కృష్ణ తమ మనసులోని బాధను సేవగా మార్చిన ఆ క్షణం నిజమైన మానవత్వానికి నిదర్శనం. కన్నీళ్ల మధ్య తీసుకున్న ఆ నిర్ణయం సమాజానికి ఒక గొప్ప సందేశం ఇచ్చింది. మనిషి చనిపోతాడు కానీ అతని దానం జీవిస్తుంది అన్న మాటకు ఇది నిజమైన ఉదాహరణ. మరణించిన తర్వాత కూడా మన కళ్ళు ఇంకొకరి ప్రపంచాన్ని చూపించగలవు మన అవయవాలు ప్రాణాలను కాపాడగలవు, మన శరీరం విద్యార్థులకు జ్ఞానాన్ని అందించగలదు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఇది 17వ నేత్రదానం. ప్రతి దానం వెనుక ఒక కుటుంబం బాధ. కానీ అదే సమయంలో ఇంకొకరి జీవితం వెలుగులు నింపే ఆశ ఉంటుంది. రామస్వామి లేరు కానీ ఆయన చూపు ఉంది. ఆయన శరీరం మాయమైంది కానీ ఆయన మానవత్వం చిరస్థాయిగా నిలిచిపోయింది. ఇలాంటి గొప్ప మనసులు సమాజానికి మార్గదర్శకాలు.

## పిల్లల బాటకు మార్గం

### - బుచ్చయ్యపల్లికి హ్యూమ్ పైప్స్ సహాయం

**బెల్లంపల్లి, మే 21, ప్రభాతవార్త**



సింగరేణి ప్రభావిత గ్రామమైన బుచ్చయ్యపల్లి గ్రామపంచాయతీకి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ హ్యూమ్ పైప్స్ అందజేయడం స్థానికులకు ఉపశమనాన్ని కలిగించింది. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, కాంగ్రెస్ నాయకులు కారుకూరి రామచందర్ నాయకత్వంలో బుచ్చయ్యపల్లి సర్పంచ్ జాడి మహేశ్వర్, మందమర్రి జీఎం రాధాకృష్ణను కలిసి సమస్యను వివరించారు. వర్షాకాలంలో ఎంపీపీ ఎస్ పెద్దదొబ్బ పాఠశాలకు వెళ్లే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వెంటనే గుర్తించిన జీఎం రాధాకృష్ణ స్పందించి, హ్యూమ్ పైప్స్ మంజూరు చేశారు. దీంతో విద్యార్థులు ఇక సురక్షితంగా పాఠశాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా సర్పంచ్ జాడి మహేశ్వర్ మాట్లాడుతూ సహకరించిన ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, కళ్యాణ్ గని ఓసిపి ఇన్‌చార్జి రమేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మేము మా కుటుంబాలు ఎలా బతకాలి..?

**లింగాపూర్, మే 21,ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న ఐకెపి వివోఏలు జై జగదాంబ మండల సమైక్య, ఏపిఎం సూర్యకాంత్ కు మేము గత 20 సంవత్సరాలుగా ఇందిరా క్రాంతి పథకంలో మహిళలను ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి పరుస్తూ, రాత్రి పగలు కష్టపడినప్పటికీ, ప్రభుత్వం మమ్ములను కనీస ఉద్యోగులుగా గుర్తించడం లేదు, మేము ఏమన్నా గొంతమా కోరికలు కోరుకోవడం లేదు. గతంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మేము అధికారంలోకి వచ్చిన వెంటనే మిమ్ములను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస గౌరవ వేతనం 20వేల రూపాయలు చెల్లిస్తామని ఎన్నికల ముందు తెలిపారు చేస్తున్న పనికి తగినంత వేతనం 20వేల రూపాయలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుకుంటున్నాము. గ్రామాలలో నివసిస్తున్న ప్రజలను ఆర్థికంగా సామాజికంగా చైతన్య పరుస్తూ ప్రభుత్వ పథకాలను వారికి అందే విధంగా కృషి చేస్తూ ప్రభుత్వం నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో సమావేశాలలో సభ్యులను తీసుకువెళ్లి చైతన్య పరుస్తున్నప్పటికీ మమ్ములను కనీస ఉద్యోగులకు గుర్తించకపోవడం చాలా బాధాకరమైన విషయం ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చేస్తాం చూస్తాం అనేటోళ్లు తప్ప మా సమస్యలను పరిష్కరించడం లేదు, ఇంకా ఎన్నాళ్ళు పస్తులు ఉంటూ పని చేయాలి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయమని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నా ము ందర అని వారి ఆవేదనని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తోడసం భగవంతురావు, జాదవ్ బాబూలాల్ తిరుపతి కుశాల్ మడవి సోను కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జై జగదాంబ మండల సమైక్య ఏపీఎం సూర్యకాంతికి సమ్మె లెటర్ ఇస్తున్న ఐకెపి వివోఏలు

# ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలి

### - జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్, మే 21, ప్రభాతవార్త :**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని జాతీయ హరిత దళం కోఆర్డినేటర్, పర్యావరణ విద్యా అంబాసిడర్ కటుకము మధూకర్ అన్నారు. గురువారం జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈజ్గాం నెంబర్3లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్య పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ హరిత దళం కోఆర్డినేటర్, పర్యావరణ విద్యా అంబాసిడర్ కటుకం మధూకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిత్యజీవితంలో భాగంగా మారినా దాని వినియోగాన్ని తగ్గించడం అత్యవసరమని తెలిపారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హిత వస్తువులను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కేన్సర్ వంటి అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నృత్య కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన మహి మండల్, హన్సిక సింగ్, తనుశ్రీ మండల్, పాయల్ దాస్‌లకు, చిత్రలేఖనంలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన సంజనా మండల్‌కు సర్టిఫికెట్లు మరియు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి డి. పూర్ణిమ ఇన్‌చార్జిగా వ్యవహరించగా, సీఆర్పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

# I, 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నిర్మల్, మే 21, ప్రభాతవార్త:**

2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ కింద 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాల కోసం షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 101 సీట్లు అందుబాటులో ఉండగా, వీటిలో 1వ తరగతిలో 49 సీట్లు, 5వ తరగతిలో 52 సీట్లు కేటాయించారని, ఒక కుటుంబం నుంచి ఒక విద్యార్థి మాత్రమే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు నిర్మల్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జూన్ 10వ తేదీన లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000 మించరాదని, 1వ తరగతి ప్రవేశానికి విద్యార్థి 01062020 నుంచి 31052021 మధ్య జన్మించి ఉండాలని, 5వ తరగతికి 4వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు. దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, నివాస, జనన ధ్రువీకరణ పత్రాలు, బోనఫైడ్ లేదా టీసీ, రేషన్ కార్డు లేదా గుర్తింపు కార్డు, మార్క్స్ మెమో (5వ తరగతికి), కలర్ ఫోటోలు జతపరచాలని, దరఖాస్తు ఫారాలను ఉచితంగా పొందవచ్చని, ఎంపికైన విద్యార్థులకు ప్రముఖ ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తామని అధికారి పేర్కొన్నారు.

# ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**ఆసిఫాబాద్, మే 21, ప్రభాతవార్త :**

జిల్లాలో వచ్చే నేల 25 నుండి ప్రారంబమయ్యే ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేపట్టేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకారం అందించి భూత్ లెవల్ ఏజెంట్లకు జాభితను అందించాలని అదనపు కలెక్టర్ ఎం డెవిడ్ అన్నారు. గురువారం సమీకృత కల్లెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతి నిదులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్బగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ జూన్ 25 నుండి జూలై 24 వరకు ఉంటుందని, బుత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటరు పారం పంపిణి చేసి తిరిగి వివరాలను సేకరిస్తారని, ఈ పక్రియలో బూత్ స్థాయి ఎజెంట్లు బూత్ స్థాయి అధికారులకు సహకారం అందించాన్నారు. జూన్ 15 నుండి 24 వరకు అధికారులకు ఈ పక్రియపై శిక్షణ యివ్వడం జరుగుతుందని తెలిపారు. ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమిల్ ,నాయబ్ తహశిల్దార్ శ్యాంలాల్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఎం డెవిడ్